క్లుప్తంగా

పెద్దమ్మ తల్లి ఆలయంలో ప్రసాదం కొరత


వెలవెలబోతున్న లడ్డూల కౌంటర్

పాల్వంచ: పెద్దమ్మతల్లి ఆలయంలో లడ్డూలు, పులిహోర కొరతతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. అయితే హనుమాన్ జయంతి కావడంతో భక్తుల రద్దీ మరింత పెరిగింది. దీంతో లడ్డూలు, పులిహోర లేక అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు నిరుత్సాహపడ్డారు. ఆలయ నిర్వాహకులు భక్తులను అంచనా వేయలేకపోవడంతో ప్రసాదాల కొరత ఏర్పడిందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఈఓ ఎన్.రజనీకుమారిని వివరణ కోరగా.. హనుమాన్ జయంతి సందర్భంగా భద్రాచలం నుంచి భక్తులు అధికంగా వచ్చారని, దీంతో ప్రసాదాలు అయిపోయినట్లు చెప్పారు. ప్రతి ఆదివారం నాలుగు వేల లడ్డూలు తయారు చేసి భక్తులకు అందజేయడం జరుగుతుందని చెప్పారు.

నిరసన శిబిరంలో మదర్స్ డే


కేక్ కట్ చేస్తున్న వీఓఏలు

ఇల్లెందురూరల్: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ నిరసన శిబిరంలోనే వీఓఏలు ఆదివారం తల్లుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శిబిరంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీఓఏల సంఘం నాయకులు మాట్లాడుతూ.. పొదుపు సంఘాల ఆవిర్భావం నుంచి పని చేస్తూ సంఘాల బలోపేతానికి అవిశ్రాంతంగా కృషి చేసిన మమ్మ్మలను ప్రభుత్వం చిన్నచూపు చూడటం సరికాదన్నారు. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం, రూ.26వేలు వేతనం ఇచ్చే వరకు సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నవ్య, పాపారావు, వసంతరావు, సురేష్, ప్రతాప్, సుల్తానా, లీలావతి, బబి, రమ, వెంకటలక్ష్మి, నిర్మల, కోటమ్మ, ధనలక్ష్మి, మనోరమ, రాంజీ, భద్రయ్య, సుమతి పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠ

పాల్వంచ: పట్టణంలోని శేఖరం బంజర గ్రామంలో ఆదివారం ఘనంగా బొడ్రాయి, ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని నిర్వహించారు. స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి రూ.10వేల విరాళం అందించారు. కార్యక్రమంలో కొండం వెంకన్న, నరసింహాచారి, బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత లేమితో హైవే పనులు

- ఎర్రమట్టికి బదులుగా చెరువు మట్టి వాడకం
- తూతూ మంత్రంగా రోడ్డు నిర్మాణం
- పట్టించుకోని ఆర్అండ్‌బీ అధికారులు


సింగభూపాలెం చెరువు మట్టిని తరలిస్తున్న దృశ్యం

సుజాతనగర్: పది కాలాల పాటు ప్రజలకు సౌకర్యంగా ఉండేందుకు ప్రభుత్వం రహదారుల నిర్మాణానికి నిధులు కేటాయిస్తుండగా... అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో రోడ్డు పనులు నాసిరకంగా జరుగుతున్నాయి. అయినా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికుల నుంచి విమర్శలు వస్తున్నాయి. భద్రాచలం రోడ్ టూ సత్తుపల్లి రైల్వే లైన్ నిర్మాణంలో భాగంగా 12వ రాష్ట్రీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి. స్థానిక గాయత్రీనగర్ వద్ద రైల్వే లైన్ వద్ద వాహనాల రాకపోకలకు అనుగుణంగా ఆర్వోబీ వంతెనతో పాటు నాలుగు కిలోమీటర్ల మేర నాలుగు లేన్ల రహదారిని నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగా గోధుమవాగుపై మరో వంతెనను కూడా ఏర్పాటు చేశారు. పోచమ్మ తల్లి ఆలయం నుంచి సుజాతనగర్ వరకు నిర్మించనున్న నాలుగు లేన్ల రహదారి విస్తరణ పనులకు రైల్వే శాఖ రూ.45 కోట్లు కేటాయించింది. ఈ క్రమంలో గుంతలమయంగా ఉన్న బీటీ రోడ్డు ఎత్తు పెంచి ఆపై బీటీ వేయాల్సి ఉంది.

ఎర్రమట్టికి బదులుగా...

ప్రస్తుతం గోధుమవాగు నుంచి వేపలగడ్డ గ్రామం వరకు బీటీ రహదారిని తొలగిస్తూ మట్టిని నింపే పనులు సాగుతున్నాయి. కాగా రోడ్డును ఎత్తు పెంచేందుకు సింగభూపాలెం చెరువు మట్టిని లారీల ద్వారా తరలించి ఇక్కడ పోస్తున్నారు. నిబంధనల ప్రకారం ఎర్రమట్టిని ఉపయోగించాల్సి ఉండగా.. చెరువు మట్టిని ఉపయోగిస్తున్నారు. ఈ మట్టి నాణ్యత లేకపోవడంతో చాలాచోట్ల కుంగి గుంతలు ఏర్పడ్డాయి. బీటీ వేయకముందే రోడ్డు కుంగుతుండగా.. బీటీ వేసిన తరువాత కుంగితే ఎలా అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నాణ్యత లేని చెరువు మట్టిని ఉపయోగించడం వలనే ఈ పరిస్థితి అని అంటున్నారు. ఈ విషయాన్ని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వేపలగడ్డ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు..

ప్రస్తుతం కొనసాగుతున్న హైవే పనులు వేపలగడ్డ గ్రామస్తులకు ప్రాణసంకటంగా మారాయి. రోడ్డు ఎత్తు పెంచేందుకు చెరువు మట్టి వాడుతుండటం, దుమ్ము, ధూళి ఇళ్లలోకి ఎగిసి పడుతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించే రోడ్డుకు చెరువు మట్టి ఉపయోగించడం సరికాదని అంటున్నారు. ఈ నేపథ్యంలో రెండు రోజులుగా వేపలగడ్డ గ్రామస్తులు రోడ్డుపై


కుంగిన రోడ్డు

లారీలను అడ్డుకుంటూ ఆందోళనలు నిర్వహిస్తున్నారు. రోడ్డుకు చెరువు మట్టి కాకుండా ఎర్రమట్టిని ఉపయోగించాలని డిమాండ్ చేస్తున్నారు.

చెరువు మట్టి ఉపయోగించకూడదు



పది కాలాల పాటు ఉండాల్సిన రోడ్డుకు చెరువు మట్టి ఉపయోగించడం సమంజసం కాదు. చెరువు మట్టి వలన రోడ్డు నాణ్యత ఉండదు. తొందరగా దెబ్బతింటుంది. చెరువు మట్టికి బదులుగా నాణ్యమైన ఎర్రమట్టిని ఉపయోగించాలి.

– అన్నపురెడ్డి గోపిరెడ్డి, వేపలగడ్డ

ఎవరూ పట్టించుకోవడం లేదు



చెరువు మట్టి వాడొద్దని ఎంత వారిస్తున్నా వినడం లేదు. దుమ్ము ధూళి ఇళ్లలోకి వచ్చి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. దుమ్ము లేవకుండా కనీసం నీళ్లు కూడా చల్లడం లేదు. అర్అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదు.

– ఉడుగుల శ్రీకాంత్, వేపలగడ్డ

‘ఎస్ఆర్’లో పటిష్టమైన విద్యాప్రణాళిక


అభినందన కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ అకాడమి పటిష్టమైన విద్యా ప్రణాళిక, క్రమశిక్షణతో కూడిన ఉపాధ్యాయుల బోధన, విద్యార్థుల కృషి, పట్టుదలతో సీబీఎస్ఈ ఫలితాలలో జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని ఎస్ఆర్ ఎడ్యుకేషన్ జోనల్ ఇన్‌చార్జ్ వై.సతీష్ తెలిపారు. రామవరంలోని ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్‌లో జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీబీఎస్ఈ ఫలితాలలో కొత్తగూడెం ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్ విద్యార్థులు అద్భుతమైన ఫలితాలు సాధించినట్లు చెప్పారు. బాణోత్ సంజయ్ 484/500 మార్కులతో జిల్లాలో మొదటి స్థానంలో నిలిచాడని తెలిపారు. రవ్వ లిఖిత-469, భూక్యా మోక్షజ్ఞ-462, కమల్-460, షేక్ నైమా-459 మార్కులతో స్కూల్ వంద శాతం ఫలితాలు సాధించిందని వివరించారు. విజయానికి సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ధన్యవాదాలు తెలిపారు. ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ అకాడమీ చైర్మన్ వరదారెడ్డి, అకాడమీ డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, సీఈఓ సురేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ క్రాంతికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచ: పట్టణంలోని శ్రీనివాసకాలనీ శ్రీనివాసగిరి ఆలయం ప్రాంగణంలోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఆలయ నిర్వాహకులు కనగాల అనంతరాములు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు శ్రీరంగం వరదాచార్యులు, ఎస్‌టీపీ రాఘవాచార్యులు, భరద్వాజా చార్యుల సమక్షంలో 108 కలశాలతో అభిషేకం, పూర్ణాహుతి హోమం, ఆంజనేయ స్వామికి విశేష పూజలు నిర్వహించారు. ప్రధాన దాత రూ.45లక్షలతో ఆలయ నిర్మాణ పనులు నిర్వహిస్తుండటం విశేషం. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో విజయ, జరబన సాంబశివరావు, నంబూరి నారాయణ, జగదీశ్, సుష్మ, నల్లమల్ల వేణు పాల్గొన్నారు.

ఎంపీ నామాకు ఘన స్వాగతం


ఎంపీ నామా నాగేశ్వరరావుతో ఎమ్మెల్యే హరిప్రియ, బీఆర్ఎస్ నాయకులు

ఇల్లెందురూరల్: టేకులపల్లి మండలంలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యేందుకు వెళ్తున్న ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావుకు మండలంలోని సుభాష్‌నగర్ కూడలి వద్ద ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, టీజీబీకేఎస్ నాయకులు ఆదివారం ఘనంగా స్వాగతం పలికారు. పూలమాలలు వేసి, సింగరేణి కార్మికులు ధరించే తట్ట, చమ్మాస్, హెల్మెట్‌ను ఎమ్మెల్యే హరిప్రియ ఎంపీ నామాకు అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నామా అందరినీ పలకరిస్తూ అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. అనంతరం ఆయన వెంట భారీ కాన్వాయ్‌తో టేకులపల్లికి వెళ్లారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, బానోత్ హరిసింగ్, పులిగళ్ల మాధవరావు, రంగనాథ్, శ్రీనివాస రెడ్డి, జేకే శ్రీను, శీలం రమేష్, మెట్టెల కృష్ణ, ఆళ్ల నాగేశ్వరరావు, గోపగాని రాజు తదితరులు పాల్గొన్నారు.

పుల్లయ్య మృతికి సంతాపం

జూలూరుపాడు: మండలంలోని కాకర్ల గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు వరమల పుల్లయ్య అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. ఆదివారం పుల్లయ్య భౌతికాయాన్ని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ సందర్శించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుదర్శన్ మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న పుల్లయ్య మృతి చెందడం బాధాకరమని, అలాంటి నాయకుడు ప్రస్తుత సమాజానికి అవసరమన్నారు. పుల్లయ్య మృతి పార్టీకి తీరని లోటన్నారు. సంతాపం తెలిపిన వారిలో సీపీఎం వైరా నియోజకవర్గ నాయకుడు భూక్యా వీరభద్రం, మండల కార్యదర్శి యాసా నరేష్, రాధాకృష్ణ, గడిదేశి కనకరత్నం, చారుగుండ్ల జగన్నాథం తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ఇల్లెందురూరల్: మండలంలోని సుదిమళ్ల స్టేజీ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్రంగా గాయాలయ్యాయి. బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీ కొల్లాపురం గ్రామానికి చెందిన చీమల రఘు, అరెం ప్రసాద్ ఇరువురు బైక్‌పై ఇల్లెందు నుంచి కొల్లాపురం వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు రోడ్డుపై పడిపోయారు. ఈక్రమంలో తీవ్రంగా గాయాలయ్యాయి. బైక్ బస్సు కిందకు దూసుకెళ్లింది. క్షతగాత్రులను స్థానికులు వెంటనే ఇల్లెందు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

సింగరేణి డైరెక్టర్‌కు సన్మానం


బలరామ్‌ను సన్మానిస్తున్న శివకుమార్

సింగరేణి(కొత్తగూడెం): ఎంతో ప్రతిష్ఠాత్మకమైన బెస్ట్ కార్పొరేట్ మేనేజ్‌మెంట్ అండ్ ఇన్నోవేటివ్, లీడర్‌షిప్, ఎక్స్‌లెన్స్‌ను సింగరేణి డైరెక్టర్(పా) ఎన్.బలరామ్ అందుకున్నారు. ఈ సందర్భంగా బలరామ్‌ను అంబేడ్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దెల శివకుమార్, సింగరేణి రిటైర్డ్ జీఎం అందెల ఆనందరావును ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఇటీవల ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లోని నేషనల్ జియో మైన్ టెక్ సంస్థ నిర్వహించిన జాతీయ టెక్నాలజీ డేలో సింగరేణి డైరెక్టర్‌కు అవార్డు రావడం అభినందనీయమన్నారు. ఈ అవార్డు యావత్ సింగరేణి అధికారులకు, కార్మికులకు, ఉద్యోగులకు గర్వకారణమన్నారు. సింగరేణి డైరెక్టర్(పా) సేవలు అభినందనీయమని, రైతు కూలీ కుటుంబంలో పుట్టి దక్షిణ భారతదేశానికి తలమానికమైన సింగరేణి సంస్థలో ఎంతో ప్రాతినిధ్యం వహించే పర్సనల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ వెల్ఫేర్ పోస్టుకు ఎన్నికై ఎందరో బడుగు, బలహీన వర్గాల కార్మికులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పట్ల స్పందించి, అవినీతి అక్రమాలకు వెలుగులోకి తీసి వారిపై చర్యలు చేపట్టిన అధికారిగా మంచిపేరు సంపాదించారని కొనియాడారు.

కర్ణాటక ఫలితాలు బీజేపీకి చెంపపెట్టు


మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

సింగరేణి(కొత్తగూడెం): కర్ణాటక అసెంబ్లీ ఫలితాలు బీజేపీకి చెంపపెట్టు అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ అన్నారు. ఆదివారం కొత్తగూడెం పట్టణ పరిధిలోని మంచికంటి భవన్‌లో జరిగిన పార్టీ జిల్లా వర్క్‌షాపు కార్యక్రమానికి ఆయన ముఖ్యవక్తగా హాజరయ్యారు. మాట్లాడుతూ.. బీజేపీకి కర్ణాటక రాష్ట్రంలో జరిగిన ఎన్నికల ఫలితాలు ప్రభావం దేశమంతటా అన్ని రాష్ట్రాల్లో పడుతుందని, ఇక నుంచి బీజేపీ పతనం ప్రారంభం అయినట్లేనన్నారు. కర్ణాటక రాష్ట్రంలో 18 మంది కేంద్ర మంత్రులు, 150 మంది ఇతర రాష్ట్రాల బీజేపీ ముఖ్యనేతలు ప్రచారం చేసినప్పటికీ హిందుత్వ, హింసాత్మక రాజకీయాలకు కర్ణాటక ప్రజలు సరైన సమాధానం చెప్పారన్నారు. తెలంగాణలో కూడా బీజేపీ ప్రభుత్వంపై ప్రజలు వ్యతిరేకంగా ఉన్నారని పార్టీశ్రేణులు క్షేత్రస్థాయిలో పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మచ్చా వెంకటేశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకులు కాసాని ఐలయ్య, ప్రజాసంఘం రాష్ట్ర బాధ్యులు వెంకటేశ్వరరావు, అన్నవరపు కనకయ్య, కారం పుల్లయ్య, మందలపు జ్యోతి, లిక్కిబాల రాజు, బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


పాదయాత్రలో వైరా ఎమ్మెలే రాములు నాయక్

జూలూరుపాడు: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ అన్నారు. ఆదివారం జూలూరుపాడు మండలంలో పల్లె పల్లెకు ప్రభుత్వ పథకాలపై ఎమ్మెల్యే పాదయాత్ర నిర్వహించారు. ముందుగా కొమ్ముగూడెం శ్రీపెద్దమ్మ తల్లి ఆలయాన్ని దర్శించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొమ్ముగూడెం, కరివారిగూడెం, తవిస్సిగుట్టతండా, కరివారిగూడెం కాలనీ, చింతలతండా, లైన్‌తండాలలో పాదయాత్ర నిర్వహించారు. పలు గ్రామాల్లో రాములు నాయక్ బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించారు. పల్లెల్లో పర్యటించిన ఆయన ఇంటింటికి వెళ్లి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు పరుస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలను వివరించారు. ఆసరా పింఛన్లు, రైతు బంధు, రైతు బీమా, రైతు రుణమాఫీ, మిషన్ భగీరథ, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలు అమలు తీరు తెన్నులపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి ఆర్థిక సాయం అందిస్తూ పాదయాత్ర కొనసాగించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఎంపీపీ లావుడ్యా సోనీ, జెడ్పీటీసీ సభ్యురాలు భూక్యా కళావతి, సర్పంచ్‌లు బానోత్ శాంతిలాల్, బోడా శాంతిరామ్, భూక్యా రాములు, ఎదళ్లపల్లి వీరభద్రం పాల్గొన్నారు.

ప్రతి ఓటరునూ ఆలోచింపజేస్తాం..


కరపత్రాలు పంచుతున్న కామేష్, కార్యకర్తలు

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం నియోజకవర్గంలోని ప్రతి ఓటరునూ కలిసి వారిని ఆలోచింపజేస్తామని బీఎస్పీ విధానాలను వివరిస్తామని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ అన్నారు. ఆదివారం బీఎస్పీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి కామేష్ కరపత్రాలను పంపిణీ చేశారు. మాట్లాడుతూ... ప్రతిఒక్కరిని కలిసి బీఎస్పీకి ఎందుకు ఓటు వేయాలో వివరించి చైతన్యవంతులను చేస్తామన్నారు. ప్రతిరోజూ వెయ్యి మంది ఓటర్లను కలవాలని లక్ష్యంగా నిర్ధేశించుకున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత బీఆర్ఎస్ ప్రభుత్వం రెండుసార్లు అధికారంలోకి వచ్చినా హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. కార్యక్రమంలో వంగా రవిశంకర్, ఇమ్మడి కోటి, నర్సమ్మ, వంశీ, సంజయ్, సాత్విక్ పాల్గొన్నారు.

సీఐటీయూ నాయకుడు జార్జికి నివాళి


జార్జి స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) వ్యవస్థాపకుల్లో ఒకరైన అమరజీవి కే.జార్జి 32వ వర్ధంతిని ఆదివారం రామవరం పట్టణంలోని ఆయన స్తూపం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు ఆయన స్తూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బ్రాంచి కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నర్సింహారావు మాట్లాడుతూ... సింగరేణిలో పనిచేస్తున్న కార్మికుల హక్కుల కోసం, కాంట్రాక్ట్ కార్మికుల స్థితిగతులపై ఆహర్నిశలు అధ్యయనం చేసి, కార్మికోద్యమాన్ని నిర్మించిన నేత జార్జి అని కొనియాడారు. వారి ఆశయాలను ఈనాటి కార్యవర్గంలో ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు రాజారావు, కార్యదర్శి శ్రీనివాస్, వై.వెంకటేశ్వరరావు, కేహెచ్ ప్రసాద్, సూరం అయిలయ్య, ఎంఎస్ రావు, బిక్కులాల్, లిక్కి బాలరాజు, భూక్యా రమేష్, లక్ష్మి, ఎర్రగాని కృష్ణయ్య, నాజర్, కే.సమ్మయ్య, అప్పారావు, ఎల్లగొండ రామ్మూర్తి, సూర్యనారాయణ, రమేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వాగునే డంపింగ్ యార్డ్ చేశారు!


వాగులోని నీటిలో పేరుకుపోయిన చెత్త


వాగులో పడేసిన వ్యర్థాలు

టేకులపల్లి: పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా సామాన్యులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పారిశుధ్యం పనులు నిర్వహించకపోవడంతో నానా తంటాలు పడుతున్నారు. మండల కేంద్రంలోని టేకులపల్లి, గోలియాతండా గ్రామ పంచాయతీలకు హద్దుగా ఉన్న ఇనుపమోరి వాగు చెత్తా చెదారానికి నిలయంగా మారింది. మండల కేంద్రం నుంచి ఇళ్ల యజమానులు, వివిధ రకాల షాపుల్లోని చెత్త, మాంసం దుకాణాల వ్యర్థాలు, కొబ్బరిబోండాలు తెచ్చి ఈ వాగులోనే పడేస్తున్నారు. అదీకాక వారాంతపు సంత కూడా ఈ వాగుని అనుకునే నిర్వహిస్తుండటంతో సంతలోని వ్యర్థాలు కూడా ఈ వాగులోకే వెళ్తుంటాయి. గాలి, వర్షం వచ్చినప్పుడు వాగులో నుంచి వచ్చే దుర్గంధాన్ని సమీప ప్రాంతాలవారు భరించలేకపోతున్నారు. గ్రామాల్లో చెత్త కుండీలు లేకపోవడం, పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో వాగే చెత్తకుండీగా మారిపోయింది. దీంతో వాగులో నీటి పారుదల లేక నిల్వ ఉంటోంది. ఉన్నతాధికారులు స్పందించి వాగులో చెత్తా చెదారం వేయకుండా చర్యలు తీసుకోవాలని, వాగులో నీటి పారుదల సక్రమంగా జరిగేందుకు పూడిక తీయించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆంజనేయ స్వామి ఆలయాలు కిటకిట

హనుమాన్ జయంతి సందర్భంగా ఆదివారం కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయాల్లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. స్వామి వారికి తమలపాకులతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. జై ఆంజనేయం.. ప్రసన్నాంజనేయం నామస్మరణతో ఆలయ ప్రాంగణాలు మార్మోగాయి. శోభయాత్ర నిర్వహించారు. పలు ఆలయాల వద్ద అన్నదానం నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్


కొత్తగూడెంటౌన్: హనుమాన్ రథయాత్రలో భక్తులు


పాల్వంచరూరల్: పునుకుల గ్రామంలో ఆంజనేయస్వామికి పూజలు


సింగరేణి(కొత్తగూడెం): హనుమాన్ చాలీసాలో పాల్గొన్న జీఎం జక్కం రమేష్


సుజాతనగర్: పూజలో పాల్గొన్న కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు


కొత్తగూడెంటౌన్: రామవరంలో...


పాల్వంచ: శాస్త్రీరోడ్‌లోని ఆలయంలో...


ఇల్లెందు: ఆలయంలో ప్రత్యేక పూజలు


టేకులపల్లి: కోయగూడెంలో అన్నదానం


జూలూరుపాడు: పాపకొల్లులో శోభాయాత్ర